
సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి


కలెక్టరేట్‌లో జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్ తదితరులు


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన


పోలీస్ జాగిలం విన్యాసం


పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న గురునాథ్‌రెడ్డి

# అభివృద్ధికి కంకణబద్ధులు కావాలి

- పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి
- పేట పరేడ్ మైదానంలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు
- పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్


పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, ఎస్పీ యోగేశ్‌గౌతమ్ తదితరులు

నారాయణపేట టౌన్, ఆగస్టు 15 : నారాయణపేట అభివృద్ధికి కంకణబద్ధులు కావాలని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, అదనపు కలెక్టర్లు మయాంక్ మిట్టల్, అశోక్ కుమార్, ట్రైనీ కలెక్టర్ గరీమా నరుల తదితరులు హాజరయ్యారు. ముందుగా ముఖ్య అతిథి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు సాయుధ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం హరిత తెలంగాణ, స్వచ్ఛ తెలంగాణ, జల సిరుల తెలంగాణ వైపు ముందుకు సాగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం సాధిస్తున్న విజయాలు తెలంగాణ బిడ్డలుగా మనకందరికీ గర్వకారణం అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాల ద్వారా రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇందిరమ్మ గ్రామ సభలు నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 61,51,482 మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని, రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా జిల్లాలో 33,310 మంది పేదలు చికిత్స పొందారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నియోజకవర్గంలో 3,500 ఇండ్లు నిర్మించడం జరుగుతుందన్నారు. మహాలక్ష్మీ పథకం కింద జిల్లాలో 61,752 మందికి లబ్ధి చేకూరిందన్నారు. ఇప్పటి వరకు 31,020 గ్యాస్ సిలిండర్లు అందించామని, ఇందుకు గానూ రూ.75 లక్షల సబ్సిడీ అందించామన్నారు. రెండు వంద యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులు జిల్లాలో ఇప్పటి వరకు 1,17,608 జీరో బిల్లులు జారీ చేయడం జరిగిందన్నారు. రుణమాఫీ కింద జిల్లాలో రూ.348.17 కోట్ల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీలతో కలిసి పరేడ్ మైదానంలో ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం పలు శాఖల అధికారులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్ర శంసా పత్రాలు అందించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు, పోలీస్ జాగిలాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఆర్డీవో మధుమోహన్, మునిసిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, అడిషనల్ ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లింగయ్యతో పాటు జిల్లా శాఖల అధికారులు, రాజకీయ పార్టీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

మరికల్‌లో..



పరేడ్ మైదానంలో విద్యార్థుల ప్రదర్శన


ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసాలు


కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్


మరికల్‌లో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు


ఎస్పీ కార్యాలయంలో జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్


పరేడ్ మైదానంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

# వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

- వారిలో ఉమ్మడి జిల్లాకు చెందిన వారు ముగ్గురు
- ఉండవల్లి వద్ద ఆటోను ఢీకొన్న కంటెయినర్
- హైదరాబాద్‌లో తుఫాన్‌ను ఢీకొన్న కారు




ఉండవల్లి మండలంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మీదేవి, రమాదేవి, హైదరాబాద్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన తాజ్ పాషా(ఫైల్)

అలంపూర్ చౌరస్తా/ఆత్మకూరు, ఆగస్టు 15: జోగుళాంబ గద్వాల జిల్లా, హైదరాబాద్‌లో గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. వారిలో ఉమ్మడి జిల్లాకు చెందిన వారు ముగ్గురు ఉన్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై కూలీలతో వెళ్తున్న ఆటోను అతి వేగంతో వస్తున్న కంటైనర్ లారీ వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు ఆస్పత్రిలో మృతి చెందారు. 15 మంది గాయపడ్డారు. ఎస్ఐ శ్రీనివాస్ నాయక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా పేపర్ మిల్లు తాండ్రపాడు గ్రామానికి చెందిన 17 మంది మహిళా కూలీలు గురువారం ఉదయం అదే గ్రామానికి చెందిన ఆటోలో ఉండవెల్లి మండల పరిధిలోని కంచుపాడు గ్రామంలోని వ్యవసాయ పొలానికి కూలీ పనులకు బయలు దేరారు. 44వ జాతీయ రహదారిపై వరసిద్ది వినాయక పత్తి మిల్లు సమీపంలో వీరు ప్రయాణిస్తున్న ఆటోను రాజస్థాన్‌కు చెందిన కంటైనర్ లారీ ఐరన్‌లోడ్‌తో హైదరాబాద్ వైపు వెళ్తూ వెనుకనుంచి ఢీకొట్టడంతో బోల్తాపడింది. ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న లక్ష్మీదేవి (56) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న హైవే, 108 సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ నరసింహులు, రమాదేవి, అనిత, ప్రియాంక, నందిని, రాధలతో పాటు మరో 11 మందిని కర్నూలు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రమాదేవి(40) మృతి చెందింది. మరో ముగ్గురు ప్రియాంక, నరసింహులు, అనితల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడని, అతడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.


ఉండవల్లి మండలం వరసిద్ధి వినాయక పత్తి మిల్లు వద్ద లారీ ఢీకొనడంతో బోల్తా పడ్డ ఆటో

### హైదరాబాద్‌లో జరిగిన ప్రమాదంలో..

ఆత్మకూరు: దైవ దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వనపర్తి జిల్లా ఆత్మకూరుకు చెందిన ఒకరు, కర్నూలు జిల్లాకు చెందిన అతని బంధువులు ఇద్దరు చనిపోయారు. బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని మందుల షాపులో పని చేసే రాజేష్ కుటుంబం, బంధువులతో కలిసి బుధవారం యాదగిరిగుట్టకు వెళ్లారు. తుఫాన్‌తో పాటు మరో ఎర్టిగా వాహనాన్ని అద్దెకు తీసుకుని 21 మంది దర్శనానికి బయల్దేరారు. దర్శనం చేసుకొని, రాత్రి అక్కడే ఉన్నారు. గురువారం ఉదయం సువర్ణగిరి పుణ్యక్షేత్రాన్ని సందర్శించి, ఆత్మకూరుకు బయల్దేరారు. మహిళలు తుఫాన్ వాహనంలో, పురుషులు ఎర్టీగాలో కూర్చున్నారు. పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద వెనుక నుంచి వచ్చిన కారు తుఫాన్ వాహనాన్ని ఢీకొంది. తుఫాన్ వాహనం పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న ఆత్మకూరుకు చెందిన తుఫాన్ యజమాని తాజ్ పాషా(36), రాజేష్ భార్య సోదరి వరలక్ష్మి(40), ఆమె మనువడు ఐదు నెలల బాలుడు అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన వారిలో మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన మరో ఎనిమిది మందిని శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తాజ్‌పాషాకు భార్య ఆసియా బేగం, ఇద్దరు కుమారులు ఉన్నారు. వరలక్ష్మి భర్త మృతి చెందడంతో ఆమె కుటుంబం కర్నూల్ పట్టణంలో నివాసం ఉంటోంది. రాజేష్ కోరిక మేరకు యాదగిరిగుట్టకు వెళ్లేందుకు ఆత్మకూరుకు వచ్చారు. సమాచారం తెలుసుకున్న రాజేష్ కుటుంబ సభ్యులు, తాజ్‌పాషా కుటుంబ సభ్యులు హైదరాబాద్ వెళ్లారు.



# విద్యార్థులకు బూట్లు తొడిగిన ఎమ్మెల్యే

- సొంత డబ్బులతో అందజేసిన అనిరుధ్‌రెడ్డి


బాదేపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఓ విద్యార్థి కాలికి బూట్లు తొడిగి, లేస్ కడుతున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, ఆగస్టు 15: బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి గురువారం బూట్లు తొడిగారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు సొంత డబ్బుతో బూట్లు పంపిణీ చేస్తానని ఇచ్చిన హామీలో భాగంగా ఎమ్మెల్యే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బూట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి రూ.25 లక్షలు ఇవ్వాలని ప్రైవేటు పరిశ్రమల ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లానని, త్వరలోనే నిధులు ఇప్పిస్తానని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని 27 వేల మంది విద్యార్థులకు బూట్లను ఇప్పిస్తానని హామీ ఇచ్చానని, ఇప్పటి వరకు సుమారు 15 వేల మంది విద్యార్థులకు పంపిణీ చేశానని చెప్పారు. రానున్న రెండు, మూడు రోజుల్లో మిగతావి పంపిణీ చేస్తానన్నారు. బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు కొందరికి ఎమ్మెల్యే స్వయంగా బూట్లు తొడిగారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రాజకీయ పార్టీల నాయకులు, పాల్గొన్నారు.

# హెచ్‌సీఏ టోర్నీలో జిల్లా జట్టు సత్తాచాటాలి

**» ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్**

**» అండర్-16 ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక**

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 15 : హెచ్‌సీఏ క్రికెట్ టోర్నీలో జిల్లా జట్టు సత్తా చాటాలని జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. నేటి నుంచి ఈనెల 24 వరకు హైదరాబాద్‌లో జరగనున్న హెచ్‌సీఏ అండర్-16 ఇంటర్ స్కూల్ కాలేజెస్ క్రికెట్ టోర్నీకి పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేశారు. గురువారం బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ మైదానంలో జట్టు స భ్యులను అభినందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రాబబుల్స్ జట్టు ఎంపిక చేసి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేశామని తెలిపారు. టోర్నీలో చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలన్నారు. హెచ్‌సీఏ టోర్నీలో మహబూబ్‌నగర్ జట్టు అనేక విజయాలు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను జిల్లా క్రికెట్ సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎండీసీఏ శిక్షణ శిబిరాల్లో ఎంతో మంది ప్రతిభ గల క్రీడాకారులు వెలుగులోకి వచ్చారన్నారు. ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, కోచ్ సాయి పాల్గొన్నారు.



హెచ్‌సీఏ అండర్-16 టోర్నీకి ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టు క్రీడాకారులు

### హెచ్‌సీఏ అండర్-16 టోర్నీకి ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టు

అంకిత్‌రాయ్, బి.సాయిచరణ్, పి.రామ్‌కుమార్‌చారి, నవల్-ఉర్-రహెమాన్, స య్యద్ ఫైజన్, దక్ష పటేల్, అఖిల్, కె.భరత్, శ్రీహర్ష, డి.అభినవ్, కాన్షిక్‌గౌడ్, మణి చరణ్, అక్షయ్‌సాయి, అభినయ్‌తేజ, ప్రణవ్‌కుమార్ జట్టుకు ఎంపికయ్యారు.

## అదుపు తప్పి వాటర్ ట్యాంకర్ బోల్తా

ఊర్కొండ, ఆగస్టు 15: అదుపు తప్పి వాటర్ ట్యాంకర్ బోల్తా పడిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో గురువారం చోటుచేసుకుంది. బాధితుడు రాచాలపల్లి గ్రామానికి చెందిన చంద్రకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాచాలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కాల్వ తండా నుంచి నీటి ట్యాంకర్‌ను తీసుకొని మండల కేంద్రానికి వస్తున్న క్రమంలో ఊర్కొండ శివారులో ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడిందని అన్నారు. దాంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదని తెలిపారు.

## కోళ్ల దాణా లారీ బోల్తా



రంగారెడ్డిపల్లి సమీపంలో బోల్తా పడిన లారీ

గండీడ్, ఆగస్టు 15 : కోళ్ల దాణా లారీ బోల్తా పడిన సంఘటన మండల పరిధిలోని రంగారెడ్డి పల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. డ్రైవర్ ఆకాష్, క్లీనర్ తెలిపిన వివరాలు ఉన్నాయి. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో నాందేడు నుంచి చెన్నైకి కోళ్ల దాణాను లారీలో తీసుకువెళ్తుండగా డ్రైవర్ నిద్రలోకి జారుకున్నాడు. దీంతో లారీ అదుపుతప్పి వరి పొలంలో బోల్తాపడింది. డ్రైవర్, క్లీనర్‌లకు ప్రమాదం తప్పింది.

## వ్యక్తి అదృశ్యం, కేసు నమోదు

కేటీదొడ్డి, ఆగస్టు 15 : జోగులాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం కొండాపురం గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తెలుగు తులసీరామ్ (50) ఈనెల ఆరో తేదీన తన పొలం నుంచి ఇంటికి వెళ్తున్నానని కుటుంబ సభ్యులతో చెప్పి వెళ్లాడు. నేటి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో గురువారం తులసీరామ్ కుమారుడు తెలుగు పరుశరాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# నమూనాల సేకరణ.. నామమాత్రమే

» విత్తనాలు, ఎరువుల నాణ్యతపై నిర్లక్ష్యం

» ఎరువుల్లో 250 శ్యాంపిల్స్‌కు తీసింది 45 మాత్రమే

పాలమూరు, ఆగస్టు 15 : ప్రభుత్వం రైతులకు మేలు చేయాలంటే మొదట చేయాల్సింది విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల్లో నకిలీని అరికట్టాలి. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సరైన సమయంలో రైతులకు అందిస్తే దిగుబడి మంచిగా సాధించి రైతులకు మేలు చేకూరుతుంది. దానికోసం వ్యవసాయ శాఖ చేయవలసిందంతా ఆయా విత్తనాలు, ఎరువులు, పురుగు మం దుల నమూనాలు సేకరించి నాణ్యమైన వాటిని గుర్తించి రైతులను అప్రమత్తం చేయాలి. నేడు ఖరీఫ్ సీజన్ సగం దాటిపోతున్నా వ్యవసాయశాఖ ఆ వైపు అడుగులు వేయ లేదు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల్లో నకిలీని గుర్తుపట్టే ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఈ ఏడాది లక్ష్యంలో సుమారు 50శాతం నేటికీ పూర్తి చేయకపోవటమే దానికి నిదర్శనం. ఎరువుల్లో ఏడాదికి 250 నమూనాలను మే, జూన్, జూలై వరకు 82 తీయాల్సి ఉండగా 68 మాత్రమే తీశారు. విత్తనాలు సుమారు 280కు 76తీ యాల్సి ఉండగా కేవలం 68 మాత్రమే తీశారు. పురుగు మందులు ఏడాదికి 73 లక్ష్యం ఉంటే అందులో ఇప్పటి వరకు 22 తీయాల్సి ఉంది, 15 మాత్రమే సేకరించారు. బహిరంగ మార్కెట్‌లో రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యమైనవో, నకిలీవో తేలాలంటే నమూనాల సేకరణ అధికంగా జరగాలి. అది వ్యాపారస్థలంలోనే జరగాలి. గతంలో సుమారు 400 నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపితే అందులో 40శాతం శ్యాంపిల్స్ విఫలమ వటంతో కొంతమందిపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపారు. భూత్పూర్ మండలంలో గతేడాది 66 శ్యాంపిల్స్ తీయగా 12 విఫలమయ్యాయి. ఈ ఏడాది 66 నమూనాలకు ఇప్పటికీ 44 తీయగా అందులో ఆరు విఫలమయ్యాయి

## నమూనాలు ఎంత ఎక్కువ తీస్తే అంత మంచిది

రైతులకు మేలు జరగాలంటే విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నమూనాలు అధికంగా సేకరించి ల్యాబ్‌కు పంపాలని నిపుణులు చెబుతున్నారు. దానివల్ల నకిలీలను అరికట్టే అవకాశం ఎక్కువ ఉంటుందంటున్నారు. అసలు నమూనాలు తీయకపోవటం నకిలీలు అమ్మే వారికి తోడ్పడటమేనని చెబుతున్నారు. ఎరువుల్లోని మైక్రో న్యూట్రీన్స్, మ్యాక్రోన్యూట్రీట్స్‌లో నమూనాలు సేకరించాలి. మిక్సర్ ఫర్టిలైజర్స్‌గా పేర్కొనే ఎరువుల్లో ఎక్కువ నకిలీలు వచ్చే అవకాశం ఉన్నందున వాటిల్లో సుమారు 90శాతం నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపాలి. గతంలో మైక్రో న్యూట్రీట్స్, మ్యాక్రోన్యూట్రీట్స్ నమూనాల్లో కొన్ని విఫలమైనట్లు తెలుస్తోంది. ఇప్పుడు అసలు ఆ నమూనాల జోలికి అధికారులు వెళ్లలేదని తెలుస్తోంది.



జడ్చర్లలో పట్టుబడిన నకిలీ విత్తనాలను ప్రదర్శిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

## విత్తనాల్లో ఫెయిల్యూర్ ఎక్కువ

గత ఏడాది విత్తనాలకు సంబంధించిన వందశాతం శ్యాంపిల్స్ తీస్తే అందులో అనేకం విఫలమయ్యాయి. జడ్చర్ల-2, భూత్పూర్-12, దేవరకద్ర-2 విత్తన కంపెనీకి చెందిన మిర్చి, మరో రెండు కంపెనీల పత్తి విత్తనాలు విఫలమయ్యాయి. పురుగు మందుల నమూనాలు గత ఏడాది 73కు మొత్తం తీశారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల శ్యాంపిల్స్ తీసే విషయంలో అధికారుల్లో నిర్లక్ష్యం కొరవడినట్లు కనిపిస్తోంది. ఇప్పటికైనా నమూనాలు సేకరిస్తే రాబోవు రోజుల్లో రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది.

# కణతి మాంసం పట్టివేత

» ముగ్గురి రిమాండ్



పట్టుబడిన ముగ్గురు నిందితులు

అమ్రాబాద్, ఆగస్టు 15 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వంగురోనిపల్లి గ్రామంలో విద్యుత్ తీగలు అమర్చి కణతిని చంపిన సంఘటనలో ముగ్గురు వ్యక్తులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అమ్రాబాద్ అటవీ అధికారి గురుమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వంగురోనిపల్లి గ్రామానికి చెందిన పిల్లి సాయిలు, జక్కా నరసింహారావు, కడారి అంజయ్య 12వ తేదీ రాత్రి గ్రామ సమీపంలోని అడవిలో విద్యుత్ తీగల ద్వారా కణతిని చంపి, దాని మాంసాన్ని విక్రయించడానికి ప్రయత్నం చేస్తున్న సమయంలో అటవీ అధికారుల బృందం వెళ్లి పట్టుకున్నట్లు ఆయన ఈ ప్రకటనలో పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి విచారణ అనంతరం కల్వకుర్తి సబ్ జైలుకు బుధవారం రాత్రి తరలించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి డిప్యూటీ రేంజ్ అధికారి వాణి కుమారి, ఖాజా మైనుద్దీన్, నాగేశం, శారద తదితర అధికారులను రేంజ్ అధికారి గురుమూర్తి అభినందించినట్లు ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇసుక ట్రాలీ పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాలీ ఆటో

కోయిలకొండ, ఆగస్టు 15 : మండలంలోని పెద్ద వాగు నుంచి అనుమతులు లేకుండా ట్రాలీ ఆటోలో తరలిస్తున్న ఇసుక ట్రాలీని గురువారం పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొన్ని రోజుల నుంచి రాత్రి, పగలు తేడాలేకుండా ఇసుక తరలింపుపై ఫిర్యాదు రావడంతో పోలీసుల దాడులు నిర్వహించి స్టేషన్‌కు తరలించారు.

# శవాన్ని పూడ్చనీయడం లేదు

» కలెక్టరేట్ ముందు ధర్నా » ఎస్సై కులం పేరుతో దూషిస్తున్నాడని ఆందోళన

» సీఐ హామీతో ధర్నా విరమించిన గ్రామస్థులు

గద్వాల క్రైం, ఆగస్టు 15 : తమ గ్రామంలో ఉన్న వ్యక్తి మృతి చెందితే ఆ కులానికి చెందిన వ్యక్తి పూడ్చనీయడం లేదని గ్రామస్థులు ఆందోళన చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన గ్రామస్థులపై కేటీ దొడ్డి ఎస్సై కులం పేరుతో దూషిస్తూ అవతలి వ్యక్తులకు వత్తాసు పలుకుతున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తూ జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు గురువారం ఇర్కిచేడు తండావాసులు ధర్నా నిర్వహించారు. గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలోని కేటీ దొడ్డి మండలం ఇర్కిచేడు తండాకు చెందిన గోర్యానాయక్(70) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పూడ్చేందుకు శ్మశానవాటికలో గుంత తవ్వించి గురువారం అంత్యక్రియలు నిర్వహించేందుకు గ్రామస్థులు వెళ్లగా శ్మశానవాటికకు పక్కన పొలం ఉన్న గోబ్ర్యానాయక్ అనే వ్యక్తి అడ్డుకున్నాడు. దీంతో గ్రామస్థులందరూ కేటీదొడ్డి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఎస్సైకి ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా తాము చెప్పేది ఏమీ వినకుండా గోబ్ర్యానాయక్‌ను పోలీస్‌స్టేషన్‌లో ఉండి తమపై దుర్భాషలాడుతూ కులం పేరుతో దూషించారన్నారు. తమపై దాడి చేసేందుకు ప్రయత్నిస్తుండటంతో శవాన్ని అలాగే ఉంచి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు ధర్నా చేసేందుకు వచ్చామన్నారు. ఎవరైనా చనిపోతే కొన్ని సంవత్సరాల నుంచి అక్కడే పూడ్చుతున్నామని, కావాలంటే అధికారులు వచ్చి పరిశీలించుకోవాలని సూచించారు. కానీ ఇవేమీ వినకుండా ఎస్సై శ్రీనివాస్ తమపై దురుసుగా ప్రవర్తిస్తూ దాడికి యత్నిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ దాదాపు గంటకు పైగానే కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న సీఐ భీంకుమార్, పట్టణ ఎస్సై శ్రీనివాస్ గ్రామస్థులకు నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. చివరకు సీఐ భీంకుమార్ శుక్రవారం ఇర్కిచేడు గ్రామానికి వచ్చి శ్మశానవాటికకు సంబంధించిన స్థలంపై పూర్తి స్థాయిలో సర్వే, విచారణ చేయిం చి ఇక ఈ సమస్య మీకు తలెత్తకుండా చేస్తానని, ఇప్పుడు వెళ్లి అంత్యక్రియలు చేయాలని, నేను హామీగా ఉంటానని చెప్పడంతో గ్రామస్థులు శాంతించి, ధర్నా విరమించారు.



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న ఇర్కిచేడు గ్రామస్థులు

ఈ విషయంపై కేటీ దొడ్డి ఎస్సై శ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా శవానికి మొదట అంత్యక్రియలు చేయాలని చెప్పానని, మిగతా విషయాలపై కూడా ఈ స్థలంపై సర్వే చేయిస్తానని చెప్పానని, కులం పేరుతో ఎవరినీ దూషించలేదని కానీ ఇవేమి వారు వినకుండా ధర్నా చేసేందుకు వెళ్లారని వివరణ ఇచ్చారు.

## 300 మీటర్ల జెండాతో ర్యాలీ

అచ్చంపేట టౌన్, ఆగస్టు 5 : స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని అచ్చంపేట నియోజకవర్గంలో వాడవాడలా గురువారం మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఈ సందర్భంగా పట్టణంలో 300 మీటర్ల జెండాతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు. గురుకుల పాఠశాలతో పాటు పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



300 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

## వ్యక్తిపై దాడి : కేసు నమోదు

వడ్డేపల్లి, ఆగస్టు 15 : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం జక్కిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి రాఘవేంద్రపై గురువారం జరిగింది. ఈ దాడికి కారణమైన రంగస్వామి, ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై అయ్యన్న తెలిపారు. పొలం విషయంలో గొడవ పడి రాఘవేంద్రపై వారు దాడి చేశారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

## హత్య కేసులో నిందితుడికి రిమాండ్

ఎర్రవల్లి, అగస్టు 15 : జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం మునుగాల గ్రామంలో చోటు చేసుకున్న బాలుడి దారుణ హత్య కేసులో నిందితుడిని అలంపూర్ కోర్టులో హాజరుపరిచి మహబూబ్‌నగర్ జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఏడు సంవత్సరాల బాలుడు రఫీని తన మేనత్త భర్త మౌలాలి బాలుడి తల్లితో పెట్టుకున్న వివాహేతర సంబంధమే హత్యకు గల ప్రధాన కారణమని వివరించారు.

## గుర్తు తెలియని శవం లభ్యం

కొల్లాపూర్, ఆగస్టు 15 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల కేంద్రంలోని గుండ్లచెరవులో గురువారం గుర్తు తెలియని శవం లభ్యమైంది. కొల్లాపూర్ ఎస్ఐ రుషికేష్ తెలిపిన వివరాల ప్రకారం..కొల్లాపూర్ పట్టణంలోని గుండ్ల చెరువులో 35 నుంచి 40సంవత్సరాల మధ్య వయస్సు గల యువకుడి శవం లభ్యమైందన్నారు. మృతదేహం కుడిచేతి మీద శివనీల అని పచ్చబొట్టు రాసి ఉందని కుడిచేతికి కడెం కూడా ఉందని గుండ్ల చెరువు ఒడ్డు మీద నల్లపు రంగు షార్టు, బూడిదరంగు ఫుల్ టీషర్టు, గోధుమ కలర్ జీన్స్‌పాయింట్, ఫోన్ బుక్కు, సున్నం డబ్బా ఉన్నాయని వివరించారు. సంబంధించిన బంధువులు ఆచూకీ తెలిపిన వారు కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ రుషికేష్ పేర్కొన్నారు.

## ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

అయిజ, ఆగస్టు 15 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణం కర్నూల్ టీ రోడ్డు సమీపంలో ఉరి వేసుకొని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై విజయ్‌భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన బోయ పెద్ద రాముడుకు 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానంగా ఓ కూతురు ఉంది. మొదటి భార్య అనారోగ్యం కారణంగా రాముడు ఏపీలోని కర్నూల్ జిల్లా పెద్దకడుమూరుకు చెందిన రాధ(22)ను ఆరు నెలల క్రితం రెండవ వివాహం చేసుకున్నాడు. ఇదే క్రమంలో గది అద్దెకు తీసుకుని ఆమెతో వేరుగా కాపురం పెట్టారు. ఈనెల 14వ తేదీ బుధవారం రాత్రి భర్త ఇంట్లో లేని సమయంలో రాధ చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు కిటికీ ఊచలు తొలగించి ఆమెను కిందకు దించగా అప్పటికే మృతి చెందింది. మృతురాలి తండ్రి లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వివాహిత ఆత్మహత్య..



వడ్ల సత్యమ్మ (ఫైల్)

వడ్డేపల్లి, ఆగస్టు 15 : ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మునిసిపాలిటీ పరిధిలోని పైపాడు గ్రామంలో చోటు చేసుకుంది. శాంతి నగర్ ఏఎస్సై అయ్యన్న తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల సత్యమ్మ(36) రెండు రోజుల క్రితం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హాస్టల్‌లో చదువుకుంటున్న మృతురాలి పిల్లలు గురువారం ఇంటికి వచ్చి చూడగా తల్లి ఉరి వేసుకొని కన్పించడంతో సమీప బంధువులకు తెలిపారు. సత్యమ్మ ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని మృతురాలి తండ్రి కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## మనస్తాపంతో యువకుడు..



శ్రీకాంత్ (ఫైల్)

బిజినేపల్లి, ఆగస్టు 15 : కొంతకాలంగా మనస్తాపంతో బాధపడుతున్న శ్రీకాంత్(23) అనే యువకుడు బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి గురువారం తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఖానాపూర్ గ్రామంలో పదేళ్లుగా శ్రీకాంత్ అక్క లీలావతి, బావ సుధాకర్ వద్ద ఉంటూ చదవుకుంటున్నాడు. తల్లిదండ్రులు పదేళ్ల క్రితం చనిపోవడంతో సొంత గ్రామం తాడూరు నుంచి ఖానాపూర్ గ్రామంలోని అక్క బావల వద్ద ఉంటున్నాడు. కొంతకాలంగా మనస్తాపంగా ఉన్న అతడు ఫారంలోని కోళ్లకు నీళ్లు పెడుతానని వెళ్లి షెడ్‌లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు ఒడిగట్టాడని తెలిపారు. మృతుడి అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### మానసిక స్థితి బాగాలేక మహిళ..

మూడేళ్ల క్రితం భర్త చనిపోయి మానసిక స్థితి బాగాలేక ఇంట్లో ఉరేసుకొని మహేశ్వరి(33) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మమ్మాయిపల్లి గ్రామానికి చెందిన మృతురాలు భర్త చనిపోవడంతో ఇద్దరు పిల్లలతో కలిసి మూడేళ్లుగా తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులతో పాటు భర్త చనిపోయిన వేదన ఒంటరిగా ఉండలేక ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. తల్లి బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రైతు డబ్బులు మాయం

» ఆందోళనలో మహిళ



మహిళా రైతు తిములమ్మ

గద్వాల, ఆగస్టు 15 : ర్యాలంపాడు రిజర్వాయర్‌లో ముంపునకు గురైన తన పొలం, ఇంటికి పరిహారం అందించాలంటూ జోగుళాంబ గద్వాల జిల్లా ఆలూరు గ్రామానికి చెందిన తిమ్ములమ్మ అనే మహిళ ఈనెల 13వ తేదీన ఆర్డీవో కార్యాలయానికి వచ్చింది. దీంతో కార్యాలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే కార్యాలయానికి చేరుకున్న పోలీసులు ఆమెను బలవంతంగా బయటకు తీసుకపోయారు. ఈ క్రమంలో పెనుగులాట జరగడంతో తన వెంట ఉన్న రూ.50 వేలు పడిపోయాయని ఆమె వాపోయింది. తాను అప్పు ఇచ్చిన వ్యక్తి తనకు తిరిగి అప్పు కట్టగా దానిని బ్యాంకులో వేయడానికి వెంటే తెచ్చుకున్నానని వివరించింది. పోలీసులు బలవంతంగా వాహనంలో ఎక్కించడం, కొత్త బస్టాండ్ వద్ద తనను బయటకు తోసేయడంతో డబ్బు లు మాయమయ్యాయని ఆరోపించింది. మరుసటి రోజు డీఎస్పీని ఆశ్ర యిస్తే పట్టణ పోలీస్‌స్టేషన్‌కు పంపించారని అక్కడ ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. తన డబ్బులు మాయం కావడానికి అధికారులతో పాటు, పోలీసులే బాధ్యులని విలేకరులకు వివరించింది. ఆర్డీవో కార్యాలయ ఆవరణలో సీసీ కెమరాలు ఉన్నాయి. పోలీసులు విచారణ చేస్తే మహిళా రైతుకు న్యాయం జరిగే అవకాశం ఉంది.

## రాష్ట్రపతి సేవా పతకానికి ఇటిక్యాల ఏఎస్సై ఎంపిక



ఏఎస్సై వెంకటేశ్వర్లు

ఇటిక్యాల, ఆగస్టు 15 : రాష్ట్రపతి సేవా పతకానికి జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల ఏఎస్సై వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. తన పదవీ కాలంలో చేసిన సేవలకు గాను గుర్తింపు సేవా పతకానికి ఆయన ఎంపికయ్యారు. 1989లో పోలీసు ఉద్యోగంలో చేరి కరీంనగర్ జిల్లాలో పనిచేసిన అనంతరం బదిలీపై అలంపూర్ నియోజకవర్గంలోని రాజోలికి వచ్చారు. అనంతరం అంచెలంచెలుగా ఎదుగుతూ మిడ్జిల్‌లో పనిచేస్తూ ఏ ఎస్సైగా పదోన్నతి పొంది 2020లో ఇటిక్యాలకు పదోన్నతిపై వచ్చారు. తన సుదీర్ఘ కాలంలో చేసిన సేవలకు గాను రాష్ట్రపతి పతకానికి ఎంపిక కావడం సంతోషదాయకమన్నారు. ఆయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా పోరుమామిళ్ల గ్రామం. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన వెంక టేశ్వర్లు పట్టుదలతో పోలీసు ఉద్యోగాన్ని సాధించారు.

# నేటితో నా ఆశయం నెరవేరింది

- డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి
- చిట్టెం నర్సిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డికి ఘన నివాళి



నర్సిరెడ్డి విగ్రహం దగ్గర నివాళి అర్పిస్తున్న కుంభం శివకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే

నారాయణపేట న్యూటౌన్, ఆగస్టు 15 : నేటితో నా ఆశయం నెరవేరిందని డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి, తనయుడు చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి 19వ వర్ధంతి సందర్భంగా గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నారాయణపేటలోని చిట్టెం నర్సిరెడ్డి, చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి విగ్రహాలకు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, పీసీసీ సభ్యులు చిట్టెం అభిజయ్‌రెడ్డితో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన బావ చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి, మామ చిట్టెం నర్సిరెడ్డి ఆశయమైన సాగునీరు ఈ ప్రాంత ప్రజలకు నేడు సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ద్వారా నేడు కార్యరూపం దాల్చడంతో వారి ఆశయం నెరవేరదని భావోద్వేగానికి గురయ్యారు. ప్రజల ఆశీస్సులతో చిట్టెం పర్ణికారెడ్డి ఎమ్మెల్యే కావడంతో తన ఆశయం నెరవేరిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి వేణుగోపాల్, ఎండీ సలీం, సదాశివారెడ్డి, కోట్ల రవీందర్‌రెడ్డి, కొనంగేరి హన్మంతు, గందె చంద్రకాంత్, శరణప్ప, బాల్‌రెడ్డి, విద్యాసాగర్ గౌడ్, రవీందర్, సుధాకర్, సాయిబాబ, మనోహర్ గౌడ్ పాల్గొన్నారు.

## చిట్టెం నర్సిరెడ్డికి ఘన నివాళి

ధన్వాడ, ఆగస్టు 15 : దివంగత మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి, చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సీఎన్‌ఆర్ ఘాట్ వద్ద బుధవారం పూలమాల వేసి నివాళి అర్పించారు. అంతకుముందు రోడ్డు వద్ద చిట్టెం నర్సిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నర్సిరెడ్డి సేవలను కొనియాడారు. చిట్టెం నర్సిరెడ్డి ఆశయాలకు కృషి చేస్తామని ఎంపీ, ఎమ్మెల్యే అన్నారు. చిట్టెం కుటుంబీకులతో పాటు కుంభం శివకుమార్‌రెడ్డి, నారాయణపేట, మక్తల్, మరికల్, ధన్వాడ, దామరగిద్ద మండలాల నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు సీఎన్‌ఆర్ ఘాట్‌ను సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు.

## స్థాయికి మించి మాట్లాడటం సరికాదు




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, ఆగస్టు 15 : స్థాయికి మించి మాట్లాడటం తగదని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మక్తల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాహుల్ గాంధీని ఉద్దేశించి బీజేపీ జిల్లా నాయకుడు భాస్కర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం అన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను మొదటగా ఖండించింది రాహుల్‌గాంధీ అన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. రాహుల్‌పై తప్పుడు ఆరోపణలు చేసి మాట్లాడటం అవివేకం అన్నారు. మరోమారు ఇలాంటి చౌకబారు విమర్శలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. సమావేశంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు విగ్నేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు పాల్గొన్నారు.

**మార్కెట్ అభివృద్ధికి కృషి..**

మక్తల్ వ్యవసాయ మార్కెట్‌యార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి మార్కెట్ అభివృద్ధిపై కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్స్ యజమానులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్‌కు పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. అలాగే మార్కెట్ హమాలీలు మాట్లాడుతూ హమాలీలకు విశ్రాంతి భవనం సదుపాయం కల్పించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. పట్టణానికి చెందిన స్వాతికి, పాతర్‌చెడ్ గ్రామానికి చెందిన కుర్వ వెంకటమ్మకు స్కూటీలు, నర్సిములుకు నగదు సాయం అందించారు.

## గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

నారాయణపేట, ఆగస్టు 15 : మండలంలోని జాజాపూర్ సర్వోదయ గ్రామీణ గ్రంథాలయానికి బుధవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వ్యవస్థాపకుడు రిటైర్డ్ డీఈవో జగదీష్‌కు నారాయణపేట ప్రముఖ రచయిత రామ్మోహన్‌రావు తాను రచించిన పుస్తకాలను బహూకరించారు. అందిన పుస్తకాల్లో చిత్రం, ప్లాస్టిక్ రహిత సమాజం, పర్యావరణ చైతన్యం, హిందువుల పండుగలు, అమ్మా జోహర్లు అనే పుస్తకాలను బహూకరించారు. పాఠకులకు ఉపయోగపడే సామాజిక అంశాల పుస్తకాలను రచయిత రామ్మోహన్‌రావు బహూకరించడం అభినందనీయం అని రిటైర్డ్ డీఈవో జగదీష్ అన్నారు.

## జనజాగరణ నిర్వహించిన కార్మిక సంఘాలు



జనజాగరణలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

నారాయణపేట, ఆగస్టు 15 : నారాయణపేటలో బుధవారం అర్ధరాత్రి కార్మిక సంఘాలు జనజాగరణ కార్యక్రమాన్ని నిర్వహించాయి. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడాలని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజావ్యతిరేఖ విధానాలను ప్రతిఘటించేందుకు జనజాగరణ నిరసన కార్యక్రమం నిర్వహించామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు అశోక్, అంజిలయ్యగౌడ్, కాశీనాథ్, కెంచి నారాయణ, కాశప్ప, బాలప్ప, నరహరి, సాయి, గౌస్, అంజి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కోస్గి, ఆగస్టు 15 : కోస్గి ఇంజనీరింగ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈనెల 16 నుంచి కంప్యూటర్ సైన్స్ సీఎస్‌ఈ, సీఎస్‌డీ, సీఎస్‌ఎంలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఈనెల 27 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. విద్యార్థులు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## మీ సేవ కేంద్రాన్ని ప్రారంభించిన తహసీల్దార్

మద్దూర్, ఆగస్టు 15 : మద్దూర్‌లో నూతన మీసేవ కేంద్రాన్ని తహసీల్దార్ మహేశ్‌గౌడ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలైన సౌకర్యాలు కల్పించేందుకు మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో మీసేవ నిర్వాహకుడు బాలగంగాధర్, అంజయ్య, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## జడ్పీ సీఈవోగా మొగులప్ప

నారాయణపేట టౌన్, ఆగస్టు 15 : నారాయణపేట జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారిగా మొగులప్ప గురువారం బాధ్యతలు స్వీకరించారు. నారాయణపేట డీఆర్డీవో అధికారిగా ఉన్న మొగులప్ప అదనంగా నారాయణపేట జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

## పాఠశాలకు మైక్ సెట్ వితరణ

నర్వ, ఆగస్టు 15 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2001-02 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు గురువారం మైక్ సెట్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమకు అక్షర జ్ఞానం నేర్పి తమ భవిష్యత్‌కు బాటలు వేసిన పాఠశాలకు తమ వంతుగా మైక్‌సెట్‌ను అందించినట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అన్నయ్య, చంద్రవదన్, విజయసింహ్మారెడ్డి, శ్రీకాంత్, ఆంజనేయులు, దివాకర్, శ్రీనివాసులు గౌడ్, కిష్టమ్మ, స్వాతి, రవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.



మద్దూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట జెండా ఆవిష్కరిస్తున్న ఎస్ఐ



ముశ్రీఫా పాఠశాలలో ప్రత్యేక వేషధారణలో చిన్నారులు

# మువ్వన్నెల రెపరెపలు

- ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం
- అలరించిన విద్యార్థుల నృత్యాలు
- జాతీయ జెండాను ఎగురవేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు



అల్లూరి సీతారామరాజు వేషధారణలో విద్యార్థి



సీవీఆర్ బంగ్లాలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



మక్తల్‌లో విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

నారాయణపేట, ఆగస్టు 15 : జిల్లా వ్యాప్తంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. వేకువ జామునే విద్యార్థులు పుర వీధుల గుండా ప్రభాత్ భేరి నిర్వహించి జాతీయ నాయకులకు జేజేలు పలికారు. ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీవీఆర్ బంగ్లాలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి జెండా ఆవిష్కరించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర పోలీస్ హౌసింగ్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, వైస్ చైర్మన్ హరినారాయణ భట్టడ్, బండి వేణుగోపాల్, ఎండీ సలీం పాల్గొన్నారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరించగా, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. మెడికల్ కళాశాల, మునిపాలిటీల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి జెండా ఆవిష్కరించగా ప్రిన్సిపాల్ రాంకిషన్ పూల మొక్క అందించి స్వాగతం పలికారు. కలెక్టరేట్, జడ్పీ కార్యాలయంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ జెండా ఆవిష్కరించారు.

● నారాయణపేట రూరల్ : మండలంలోని కోటకొండ, కొల్లంపల్లి, బోయిన్‌పల్లి, పేరపళ్ల, చిన్నజట్రం, జాజాపూర్ గ్రామాల్లో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల దగ్గర పంచాయతీ కార్యదర్శులు, పాఠశాలల దగ్గర ఉపాధ్యాయులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● మరికల్ : మండలంతో పాటు వివిధ గ్రామాల్లో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ మురళి, తహసీల్దార్ జమీల్, మండల స్పెషల్ అధికారి కృష్ణ, పంచాయతీ స్పెషల్ అధికారి నరేందర్, గ్రంథపాలకుడు మల్లికార్జున్, యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్ ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చౌరస్తాలో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సీఐ, ఎస్ఐ విద్యార్థులకు నోటుబుక్స్‌లు, పెన్నులు బహూకరించారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులకు స్పెషల్ ఆఫీసార్, కార్యదర్శి శ్యామ్ సుందర్‌రెడ్డి రేయిన్ కోర్టులు అందజేశారు.

● ధన్వాడ : ధన్వాడతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సింధూజ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సాయిప్రకాష్, సింగిల్‌విండో కార్యాలయంలో విండో చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ఉమాదేవి, మత్స్య సహకర సంఘంలో చైర్మన్ సీరటి నర్సిములు నాయుడు జాతీయ జెండాను ఎగురవేశారు.

● కొత్తపల్లి : మండల కేంద్రంతో పాటు భూనీడు, నిడ్జింత గ్రామాల్లో విద్యార్థులు వీధుల గుండా జాతీయ గీతాలు పాడుతూ ప్రభాత్ భేరి నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ అనిల్‌కుమార్, ఉప విద్యుత్ కేంద్రం ముందు కిరణ్‌కుమార్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.




స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో విద్యార్థులు

● నర్వ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాల వద్ద స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అధికారులు జాతీయ జెంగాను ఎగురవేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మల్‌రెడ్డి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, జడ్పీహెచ్‌ఎస్ వద్ద హెచ్‌ఎం రామకృష్ణ, వైద్యాధికారి వెంకటరమణ, ఎస్ఐ కుర్మయ్య, పీఏసీఎస్ వద్ద చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ పంచాయతీ వద్ద కార్యదర్శి బుచ్చారెడ్డి, గాంధీ విగ్రహం వద్ద రవీందర్ రెడ్డి, అంబేడ్కర్ విగ్రహం వద్ద అధ్యక్షుడు దండు అయ్యప్ప జాతీయ జెండాను ఎగురవేశారు.



పరేడ్ మైదానంలో వేడుకలకు హాజరైన విద్యార్థులు

● కోస్గి : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల ల్లో జాతీయ జెండా ఎగరవేసి సంబురాలు జరుపు కున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేకాధికారి బ్రహ్మానందం జెండా ఎగురవేశారు.

● ఊట్కూర్ : మండల వ్యాప్తంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఊట్కూర్ ఎంపీడీవో కార్యాలయం వద్ద మండల ప్రత్యేక అధికారి జీవరత్నం, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ రవి, వ్యవసాయ కార్యాలయం వద్ద ఏవో గణేష్‌రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద డాక్టర్ భవాని, సింగల్‌విండో కార్యాలయం వద్ద అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఊట్కూర్ గ్రామ పంచాయతీ వద్ద ప్రత్యేక అధికారి ఎంపీడీవో ధనుంజయ్‌గౌడ్, పాఠశాల వద్ద హెచ్‌ఎంలు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఊట్కూర్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఏపీవో సత్యప్రకాష్, ఎంపీహెచ్‌వో విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు సూర్యప్రకాష్‌రెడ్డి, భాస్కర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు గోవిందప్ప, హన్మంతు, మాజీ ఉప సర్పంచ్ ఇబాదుర్ రహెమాన్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహెమాన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజ్ఞేశ్వర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు గోపాల్‌రెడ్డి, మోహన్ రెడ్డి, జనార్దన్‌రెడ్డి, శంకర్, లింగం, రఘువీర్, చందు లాల్, ఖలీల్ జెండా ఆవిష్కరణలో పాల్గొన్నారు.

● దామరగిద్ద : మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పోలీస్‌స్టేషన్, వ్యవసాయ సహకార కేంద్రం, జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్యాతన్‌పల్లి, కంసాన్‌పల్లి, వత్తుగుండ్ల, దేశాయిపల్లి గ్రామాల్లో వేడుకలను జరిపారు. కానుకుర్తి జడ్పీహెచ్‌ఎస్‌లో 2009-10లో పదో తరగతి చదవిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు 100 ప్లేట్లను అందించారు.

● మద్దూర్ : మండలంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మద్దూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఎస్ఐ రాంలాల్, తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ మహేశష్‌గౌడ్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి రామన్న, పీఏసీఎస్ కార్యాలయం ఎదుట చైర్మన్ నరసింహ, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాములు జెండాను ఆవిష్కరించారు. నాయకులు రఘుపతి రెడ్డి, సంజీవ్, వెంకటయ్య, రాములుగౌడ్, బుగ్గప్ప, వీరేశ్‌గౌడ్, ఉస్మాన్, భీములు పాల్గొన్నారు.

● కృష్ణ : మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ, పోలీస్‌స్టేషన్, వ్యవసాయ సహకార కేంద్రం, జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళి అర్పించారు. తహసీల్దార్ దయాకర్‌రెడ్డి, ఎంపీడీఓ జానయ్య సుదర్శన్ గౌడ్, ఎస్ఐ నవీద్, రెవెన్యూ అధికారులు అమరనాథరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, రాజు, అభిలాష్, మానస, సునీల్, సురేంద్రబాబు, కతలప్ప, నాయకులు సోమ శేఖర గౌడ, పల్లె సురేష్, మాజీ సర్పంచులు లక్ష్మి నారాయణ గౌడ్, శివప్ప, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రామచంద్ర, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు అంజనమ్మ పాటిల్, శివరాజ్ పాటిల్ పాల్గొన్నారు.



మరికల్‌లో విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు



కృష్ణ తహసీల్దార్ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న అధికారులు

● మాగనూరు : మండలంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు దేశభక్తి నాయకుల వేషాధరణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తహసీల్దార్ కార్యాలయంలో సురేష్, ఎంపీడీవో కార్యాలయంలో అబ్దుల్ ఖలీల్, పీఎస్‌లో ఏఎస్ఐ మన్నన్, లైబ్రరీ వద్ద కృష్ణయ్య, కాంగ్రెస్ కార్యాలయం వద్ద అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, పీహెచ్‌సీ వద్ద డాక్టర్ నాగజ్యోతి, ప్రభుత్వ పాఠశాల వద్ద హెచ్‌ఎం మురళీధర్‌రెడ్డి, జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, సింగిల్‌విండో కార్యాలయం వద్ద అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.



క్యాతన్‌పల్లి గ్రామంలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న గ్రామస్థులు

● మక్తల్ : 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మునిసిపల్ కార్యాలయంలో పుర చైర్‌పర్సన్ బాల్రెడ్ పావనీతో కలిసి జెండా ఆవిష్కరించారు. అలాగే పోలీస్‌స్టేషన్‌లో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భాగ్యలక్ష్మీ రెడ్డి, బాలుర ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎం అనిల్ గౌడ్, వ్యవసాయ కార్యాలయంలో మితున్‌చక్రవర్తి, మార్కెట్ కార్యాలయంలో కార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో తిరుపతయ్య, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సతీష్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అంతకుముందు వివిధ పాఠశాలల విద్యార్థులు జాతీయ నాయకుల వేశధరాణలో అలరిస్తూ ప్రభాత్ భేరీ నిర్వహించారు. అలాగే స్వామి వివేకానంద చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత పీఈటీ గోపాలం అంబేడ్కర్ చౌరస్తాలో జెండా ఆవిష్కరించారు. లయన్స్‌క్లబ్ భవనం వద్ద క్లబ్ అధ్యక్షుడు డీవీచారీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి మొక్కలు నాటారు.

● మక్తల్ రూరల్ : మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రైవేటు ఆఫీసుల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కర్నీ పీహెచ్‌సీ, గుడిగండ్ల, జక్లేర్ ఉన్నత పాఠశాలలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు.



బోయిన్‌పల్లిలో ప్రభాత్ భేరిలో పాల్గొన్న విద్యార్థులు



మద్దూర్ పోలీస్‌స్టేషన్ వద్ద విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న అధికారులు



మాగనూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద జెండాకు వందనం చేస్తున్న మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్



ఊట్కూర్ ప్రాథమిక పాఠశాల వద్ద జెండాకు వందనం చేస్తున్న ఉపాధ్యాయులు

## ప్రతిభావంతులకు పురస్కారాలు

నారాయణపేట టౌన్, ఆగస్టు 15 : జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలలో ప్రతిభ కనపర్చిన అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ పురస్కారాలు ప్రకటించారు. గురువారం జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందుకున్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న డీఎస్పీ లింగయ్య



ఎస్పీ పీఆర్వో వెంకట్రాములు



డీపీఆర్వో ఉద్యోగి అలివేల



మునిసిపల్ కమిషనర్ సునీత



పంచాయతీ కార్యదర్శి చాణిక్యరెడ్డి



ఇన్నోవేటర్ నవీన్ కుమార్